కథ

# ప్రేమంటే ఇదే!

''ప్రేమంటే ఏవిటి?''

అస్తమిస్తున్న సూర్యుడి అందాన్ని తదేకంగా చూస్తున్న వారిజ తల పక్కకి తిప్పి, సాకేత్ వైపు చూసింది. ఒక్కక్షణం తదేకంగా అతని కళ్ళలోకి చూసి నవ్వింది. నవ్వుతూనే తల తిప్పుకుని తిరిగి సూర్యాస్తమయాన్ని చూడ్డంలో నిమగ్నమైంది.

''చెప్పు..ప్రేమంటే ఏవిటి?'' మళ్ళీ అడిగాడు సాకేత్.

''అది ఎవరికివారే అనుభవించి తెలుసుకోవలసినది..'' వారిజ నవ్వుతూ అంది.

''అలాకాదు. సరైన డెఫినిషన్ ఇవ్వు..'' సాకేత్ పట్టుబట్టాడు.

''ఈ ప్రపంచంలో ఏ ఇద్దరూ ఒకేలా నిర్వచనం చెప్పని పదం ఒకటుంటుంది. అదే ప్రేమ..''

''అబ్బా..సరిగ్గా చెప్పు వారిజా....''

''నిజమైన ప్రేమను వ్యక్తం చేసేందుకు మాటల అవసరంలేదు..''

''ప్లీజ్ వారిజా..ప్రేమంటే ఏవిటో ఒకే ఒక్కమాటలో చెప్పు'' రిక్వెస్టింగ్‌గా అన్నాడు.

''ప్రేమని నిర్వచించడం కష్టం. ప్రేమ స్వభావాన్ని, స్వరూపాన్నీ- ఒకరోజున మీరే తెలుసుకుంటారు. అప్పుడు మీకే తెలుస్తుంది ప్రేమంటే ఏవిటో!''

★★★

''కొంప మునిగింది..'' అరిచాడు వెంకట్రావు.

''ఒట్టి మునగడం కాదు..ఒరిస్సా తుఫాను'' నెత్తిన చెయ్యి పెట్టుకుని దిగాలుగా అన్నాడు సుధాకర్.

''కాదు..కార్గిల్ యుద్ధం'' భయంగా గొణుక్కున్నాడు శేషగిరి.

''తుఫానేమిటో, యుద్ధమేమిటో?'' అప్పుడే ఆఫీ

> ''భార్యాభర్తలు ఒకరి తప్పుల్ని ఒకరు ఎత్తిచూపుకోడం, గొడవపడ్డమే మార్గం కాదని, తప్పని సరిదిద్ది, జీవితాన్ని చిందర వందర కానివ్వక తిరిగి సక్రమ మార్గంలో నడిచేలా చేయడమే అసలైన సంస్కారం అని, అదే నిజమైన సంస్కారణ అని..నీ ప్రవర్తన నాకు మౌనంగానే విప్పి చెప్పింది.

సులికి వచ్చిన ప్రకాష్ అడిగాడు.

''మన మందుపార్టీ గురించి మన ఇళ్ళల్లో తెలిసింది'' చెప్పాడు వెంకట్రావు.

''ఏ మందుపార్టీ..?'' ప్రకాష్ కంగారుగా అడిగాడు.

''వారం రోజులక్రితం, ఆఫీసులో పనుంది రాత్రంతా రావడానికి కుదరదని ఇంట్లో చెప్పి, నీ ఫ్రెండ్ గెస్ట్‌హౌస్‌లో పేకాట, మందు, అమ్మాయిలతో ఎంచక్కా రాత్రంతా ఎంజాయ్ చేసామే..ఆ మందుపార్టీ నాయనా..'' అసలు సంగతి వివరించాడు సుధాకర్.

''మైగాడ్..ఇంట్లోవాళ్ళకి ఎలా తెలిసింది?'' తల పట్టుకుని డిపోతూ అడిగాడు ప్రకాష్.

''ఆ గెస్ట్‌హవుస్ వాచ్‌మెన్ పెళ్ళాం, మన ప్రసాద్ వాళ్ళావిడకి నిన్న మార్కెట్‌లో కనబడి చెప్పిందట. సిన్న ప్రసాద్ వాళ్ళింట్లో పెద్ద గొడవైందట. అంతేకాదు ఆవిడ పనిగట్టుకుని ఈరోజు మనందరి ఇళ్ళకు ఫోన్ చేసి, ఈ విషయం చెబుతానని బెదిరించిందట. ఈపాటికి ఆ వార్త మనందరి ఇళ్ళకీ చేరేవుంటుంది..'' శేషగిరి కళ్ళల్లో భయం తొంగి చూస్తోంది.

''షిట్..ఎందుకురా అలా భయపడతారు! పెళ్ళాంకి భయపడడమేమిటీ?'' విలాసంగా సిగరెట్ పొగ వదులుతూ అన్నాడు ప్రకాష్.

''ఈ మాట మీ ఆవిడముందు అను'' ఛాలెంజ్‌గా అన్నాడు వెంకట్రావు.

''నిజమే! ఇప్పుడు ఆడవాళ్ళు బాగా తెలివి మీరిపోయారు. ఇదివరకులా మనం ఏమన్నా పడి వుండడం లేదు. ఎదురు తిరుగుతున్నారు. వాళ్ళంటే మనమే భయపడి చచ్చే మాయదారి రోజులొచ్చాయి..'' ప్రకాష్ కసిగా అన్నాడు.

''సాకేత్, నువ్వేంటి మాట్లాడవు? మీ ఆవిడేమంటుందోనని భయంగా వుందా..?'' అంతసేపూ నోరు విప్పి ఒక్కమాటైనా మాట్లాడని సాకేత్‌ని చూస్తూ అన్నాడు సుధాకర్.

సాకేత్ ఏం మాట్లాడలేదు.

అతను ఆలోచిస్తున్నది సాయంత్రం జరగబోయే గొడవ గురించి కాదు. ఈ విషయం తెలియగానే హర్టయే వారిజ మనసు గురించి!

వారిజకి జీవితం పట్ల, వివాహం పట్ల కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలూ, నిర్ణయాలు వున్నాయి. యమ డిసిప్లినేరియన్. అబద్ధాలన్నా, మోసాలన్నా అసహ్యించుకుంటుంది. ఈ సంగతి తెలిసి ఎంత హర్ట్ అయి వుంటుందో..బాధగా అనుకున్నాడు సాకేత్.

'రాను మొర్రో' అన్నా వీళ్ళంతా బలవంతంగా లాక్కెళ్ళారు...కలతలనేవే ఎరుగని కాపురంలో చిచ్చుపెట్టారు. తన ఫ్రెండ్స్ అందరిమీదా పీకలదాకా కోపం వచ్చింది సాకేత్‌కి.

సాకేత్ మౌనాన్ని మరోలా అర్థం చేసుకున్న సుధాకర్ ''మరీ అంత భయపడకురా బాబూ..ఎట్లాగో సర్ది చెప్పుకో ఈసారికి! శ్రీకృష్ణుడంతటి వాడికే తప్పలేదు ఈ పాట్లు. మనమెంత?'' ధైర్యం చెబుతున్నట్టుగా అన్నాడు.

సాకేత్ జవాబు చెప్పలేదు. మౌనంగా అక్కడనుండీ వెళ్ళిపోయాడు.

''పాపం..గురుడు చాలా భయపడుతున్నట్టున్నాడు..'' జాలిగా అన్నాడు వెంకట్రావు సాకేత్ వెళ్ళిన వైపే చూస్తూ!

''ఏం చేస్తాం నాయనా? ఆడవాళ్ళా..మజాకానా? సాయంకాలం మనం ఇళ్ళకి వెళ్ళేసరికి అట్లకాడలు, అప్పడాల కర్రలు స్వాగతమిస్తాయి కాబోలు... బెస్టాఫ్ లక్! రేపందరూ క్షేమంగా ఆఫీసుకు రావాలని కోరుకుంటున్నాను..'' అందర్నీ విష్ చేసి ప్రకాష్ తన సీట్లోకి వెళ్ళిపోయాడు. అందరూ అన్యమనస్కంగానే ఫైళ్ళలోకి తలలు దూర్చారు.

★★★

ఒకలాంటి జంకుతోనే ఇంట్లో అడుగుపెట్టాడు సాకేత్. ఇంట్లో యుద్ధవాతావరణమేదీ కనిపించలేదు. అలగడమంటే తనకి అసహ్యం అని ఎప్పుడో ఏదో సదర్భంలో వారిజ అన్నట్టు గుర్తు. అందుకని కోపగృహ ఛాయలేవీ కనబడ్డంలేదేమో!

ఎప్పటిలా నవ్వుతూ ఎదురొచ్చింది వారిజ. ఆ నవ్వు స్వచ్ఛంగా, ప్రశాంతంగా వుంది బహుశః తుపాను ముందర ప్రశాంతతేమో ఇది..అనుకుంటూ సోఫాలో కూర్చుని షూ విప్పుకునే వంకతో తల వంచుకున్నాడు ఆమె మొహంలోకి చూసే సాహసం లేక!

''ఏవిటీ మొహం అలా వాడిపోయి వుంది, ఆఫీసులో పని ఎక్కువగా వుందా ఈరోజు?'' సాకేత్ పక్కనే కూర్చుంటూ లాలనగా అడిగింది వారిజ.

ఆ ప్రశ్నలో వ్యంగ్యం ఏమైనా వుందేమోనని వెతికాడు. మామూలుగానే వుంది. ఆ మాటలో, అడిగే తీరులో ఎక్కడా వ్యంగ్యం లేదు.

''ఆ..కాస్త ఎక్కువే వుందీరోజు..'' అంటూ అక్కడ నుండీ లేచాడు ఆమెను ఫేస్ చేయలేక!

''స్నానంచేసి రండి. టిఫిన్ రెడీగా వుంది..'' కిచెన్‌లోకి వెళ్తూ అంది వారిజ.

సాకేత్ గబగబా వెళ్ళి బాత్రూమ్‌లో దూరాడు.

ఆ తర్వాత కార్యక్రమాలు కూడా రోజూలాగే జరిగిపోయాయి. వెతికినా ఆమెలో కోపంగానీ, అలకగానీ కనబడలేదు. ఆ క్షణంలో సాకేత్‌కి ఆమె ఒక అర్థంకాని పజిల్‌లా తోచింది.

అసలింతకీ వారిజకీ విషయం తెలిసినట్టా..తెలియ

నట్టా? తెలిస్తే ఇలా మామూలుగా ఎలా వుండగలుగుతుంది? నిలదీసి అడగకుండా వుంటుందా? అలాంటి సీనేదీ తనకి ఎదురుకాలేదు కాబట్టి ఆమెకి విషయం ఇంకా తెలియలేదు అనుకోవాలా?

కాదు..కాదు..తెలిసే వుంటుంది.

ప్రసాద్‌గాడి భార్య అసలే గయ్యాళిది. చెప్పకుండా ఎలా వుంటుంది? పనిగట్టుకుని మరీ పేరు పేరునా అందరిళ్ళకీ ఫోన్లు చేసి చెప్పేవుంటుంది. అందులో సందేహమే లేదు. మరి వారిజ ఇలా మామూలుగా వుందేమిటి? అబద్ధాలంటే సహించని మనిషికి చాలా కోపం రావాలే! ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోయింది సాకేత్‌కి. ఆలోచనల మధ్య అతనికి చాలాసేపు నిద్రపట్టలేదు.



★★★

''ఏరా అంతా క్షేమమేనా..?'' ప్రసాద్ ఆఫీసులో అడుగుపెడుతూనే అందర్నీ పరామర్శించాడు.

''ఆ..ఆ..ఒక తుఫాను వచ్చి వెలిసినట్టుంది..'' నిట్టూరుస్తూ అన్నాడు వెంకట్రావు.

''మా ఆవిణ్ణి సముదాయించి శాంతపరచేసరికి తల ప్రాణం తోకకి వచ్చిందనుకో..'' నీరసంగా అన్నాడు సుధాకర్.

''దీనికంతటికీ ఆ వాచ్‌మెన్ పెళ్ళామే కారణం. దాని దుంపతెగ. ఎంతటి ప్రళయం సృష్టించింది! ఈసారి నిజంగా రాత్రి ఆఫీసులో పనుందన్నా మన వాళ్ళు నమ్మరు..'' ప్రకాష్ ఉసూరుమన్నాడు.

సాకేత్ ఏదో ఆలోచనలో వున్నట్టు మౌనంగా వుండిపోయాడు.

''వాట్ సాకేత్? నిన్న మీ ఆవిడ బాగా క్లాసుకి ఆరేసిందేవిటీ..ఇంకా డల్‌గా వున్నావు?'' సానుభూతిగా చూస్తూ అడిగాడు వెంకట్రావు.

''అసలు ఆ విషయమే ఎత్తలేదు మా ఆవిడ..'' కూల్‌గా చెప్పాడు సాకేత్.

''వ్వాట్..'' స్నేహితులంతా కోరస్‌గా అన్నారు.

''అవును'' మళ్ళీ చెప్పాడు సాకేత్.

''ఒకవేళ వారిజగారికీ విషయం ఇంకా తెలియలేదేమో..'' అనుమానంగా అన్నాడు ప్రకాష్.

''తెలియకపోవడమేమిటి? మా ఆవిడ పనిగట్టుకుని మీ అందరిళ్ళకీ ఫోన్లు చేసానంది. సాకేత్ వైఫ్‌కి కూడా ఫోనుచేసి చెప్పానంది..'' సాకేత్ వైపు కాస్త ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు ప్రసాద్.

సాకేత్ పరిస్థితి అయోమయంగా తయారైంది. అతనికేమీ అర్థంకాకుండా వుంది.

''ఒకవేళ సాకేత్ వైఫ్ పరమ పతివ్రతయేమో..'' అన్నాడు ప్రకాష్.

''ఇంకా ఏ యుగంలో వున్నావు నాయనా? ఈరోజుల్లో ఆడవాళ్ళు మహిషాసుర మర్ధనిలు, సత్యభామలు. మనం ఒక్కమాటన్నా పడి వూరుకోవడంలేదు. ఎదురు తిరుగుతున్నారు. డైవోర్స్ ఇస్తామని బెదిరిస్తున్నారు..'' వాదించాడు వెంకట్రావు.

''పోనీ..వారిజగారికి కాస్త ఎక్కువేమో..ఒకరోజు ఆగి ఇవాళ మనవాడి భరతం పడుతుందేమో..'' ప్రకాష్ మాటలకి అందరూ నవ్వారు.

సాకేత్ మనసు మాత్రం గందరగోళంగా తయారైంది.

విశారద

★★★

ఒకరోజు, రెండు రోజులుకాదు, నెలరోజులు గడిచాయి. ఇంట్లో ప్రళయం వచ్చే సూచనలేవీ కనపడ్డంలేదు. కుడితిలో పడ్డ ఎలుకలా వుంది సాకేత్ పరిస్థితి. తన ఫ్రెండ్స్ పనే బావుంది. వాళ్ళ ఇళ్ళల్లో తుపానులు, భూకంపాలు రావడం పరిస్థితి చక్కబడడం ఎప్పుడో జరిగిపోయింది. తన పొజిషనే అధ్వాన్నంగా వుంది.

వారిజ తనతో మామూలుగానే వున్నా, తనే ఆమె దగ్గర ఫ్రీగా వుండలేకపోతున్నాడు. గిల్టినెస్‌తో సరిగా మాట్లాడలేకపోతున్నాడు. వారిజని చూస్తున్నకొద్దీ అసలేవీ అర్థంకాకుండా వుంది. ఇక ఈ అశాంతిని భరించడం తనవల్ల కాదనిపించింది అతనికి.

''మిల్తీహై జిందగీమే మొహబ్బత్ కభీ కభీ..'' కూనిరాగం తీసుకుంటూ, కిచెన్ తలుపులు మూసి, బెడ్రూమ్‌లోకి వచ్చింది వారిజ. మల్లెల సువాసన కూడా ఆమెతోబాటే గదిలోకి అడుగుపెట్టింది.

టైముకి పనులన్నీ చకచకా ముగించేస్తుంది. ఎప్పుడూ బద్ధకించదు. ప్రతీ పనీ టైము ప్రకారం పూర్తవ్వాల్సిందే. ఎక్కడా తేడా రానివ్వదు. వాట్ ఎ గ్రేట్ లేడీ

పీ ఈజ్.. వారిజ వైపే తదేకంగా చూస్తూ అనుకున్నాడు సాకేత్.

''ఏమిటీ అలా చూస్తున్నారు?'' పక్క సర్దుతూ అడిగింది వారిజ.

''నథింగ్..దా కూర్చో..పని అయిపోయిందా'' వారిజ చెయ్యి పట్టుకుని తన పక్కన కూర్చోబెట్టుకుంటూ అడిగాడు.

''పని అయిపోబట్టే వచ్చాను కానీ, ఏంటీ సంగతి...?''

మెల్లగా సాకేత్ అసలు విషయం కదిపాడు.

''వారిజా..ఈమధ్య సీత, పద్మ, లలిత వీళ్ళెవర్నీ కలవలేదా..?''

''ఏం..అంత పర్టిక్యులర్‌గా అడుగుతున్నారు?''

''అ..హ..ఏంలేదు. సింప్లీ అయామ్ ఆస్కింగ్'' కాస్త తడబడుతూ అన్నాడు.

''అప్పుడప్పుడూ కలుస్తూనే వుంటాం. ఇంతకీ విషయం ఏవిటీ?''

''అబ్బే..విషయమంటూ ఏవీలేదు..'' సాకేత్ మళ్ళీ తడబడ్డాడు.

''చెప్పండి. వాటీజ్ ద మాటర్..?'' వస్తున్న నవ్వును ఆపుకునేందుకు ప్రయత్నిస్తూ అంది వారిజ.

''అది..అది..ప్రసాద్ వైఫ్ నీకేమీ చెప్పలేదా?''

''దేనిగురించి?'' వారిజ అమాయకంగా అడిగింది.

ఇక లాభంలేదనుకుని సాకేత్ డైరెక్టుగా విషయానికొచ్చాడు.

''అదే..ఆమధ్య ఒకరోజు రాత్రంతా ఆఫీసులో పనుందని చెప్పి ఇంటికి రాలేదు చూడూ..అదే..నిజానికారోజు మాకు ఆఫీసులో పనిలేదు. మేమంతా ఒక గెస్ట్ హవుస్‌లో పార్టీ చేసుకున్నాం. ఈ సంగతి ఆవిడ నీకు చెప్పలేదా?'' వారిజ వైపు సూటిగా చూడలేక, కిటికీలో నుండి బైటికి చూస్తూ అడిగాడతను.

''చెప్పింది..''

''చెప్పింది? ఎప్పుడు?'' సాకేత్ కంఠంలో ఉద్వేగం.

''ఆరోజే..విషయం ఆవిడకి తెలిసిన మర్నాడే'' తాపీగా చెప్పింది వారిజ.

''మరి..మరి..నువ్వు..నన్ను'' ఏం అడగాలో ఎలా అడగాలో సాకేత్‌కి తెలియలేదు.

''విషయం తెలిసికూడా, నేను మీతో గొడవపడలేదే అని మీ సందేహం అంతేనా?'' నవ్వుతూ అడిగింది వారిజ.

''అవును..ఎందుకు?'' అతని మాటల్లో ఆసక్తి, ఆశ్చర్యం!

వారిజ రెండు క్షణాలు మాట్లాడలేదు.

''అడిగితే ఏం జరిగేది? మీరు సారీ చెప్పేవారు. మరోసారి..మరోరోజు, నాకు తెలియకుండా మీరు అన్ని జాగ్రత్తలు తీసుకుని, ఇంకెక్కడో పార్టీ అరేంజ్ చేసుకుంటారు. డిటెక్టివ్‌లా మిమ్మల్ని అనుక్షణం వెంటాడలేను కదా..మీ మనసే మీకు సాక్షి. నాకు తెలియకుండా, నన్ను మోసం చేసి మీరిలాంటి పన్లు చేస్తే..మిమ్మల్ని మీరు వంచించుకున్నట్టే. ఒక అబద్ధం ఆడితే దాన్ని కప్పిపుచ్చుకునేందుకు మరిన్ని అబద్ధాలాడాల్సి వస్తుంది. ఎందుకీ ఆత్మవంచన? పెళ్ళికి పునాది నమ్మకం. ఒకరికొకరు అనుమానించుకుంటూ కాపురం చేయడం కంటే నా దృష్టిలో హేయమైనది మరొకటి లేదు. ఏ విషయానికైనా సరే, అనుమానిరచడం, గొడవపడ్డం, దెబ్బలాడ్డం..నాకిష్టం లేదు. అది నా స్వభావానికే విరుద్ధం. ఎవరి వ్యక్తిత్వాన్ని వారు తీర్చిదిద్దుకోవాలి. ఒకరి భయం వల్ల, శాసించడం వల్ల...ఎంతకాలం కట్టుబడి వుంటారు? తప్పు చేసి, ఒకరి ముందు తల వంచుకోవాల్సిన పరిస్థితి తెచ్చుకోకూడదు..'' సూటిగా స్పష్టంగా చెప్పింది వారిజ!

''యూ ఆర్ కరక్ట్. కానీ, నేనేం చేసినా ఇలాగే ప్రశ్నించుకుండా వూరుకుంటావా?''

''మనిషికొకమాట, గొడ్డుకొక దెబ్బ అన్నారు. వ్యక్తిత్వమున్న మనిషి తనని ఎవరైనాసరే, వేలెత్తి చూపించడాన్ని సహించలేడు. అది లేని మనిషికి ఎన్నిసార్లు చెప్పినా ఒకటే. వినడు..మారడు'' వాడిగా, వేడిగా తగిలాయతనికి ఆమె మాటలు.

ఒక్కక్షణం అతనేమీ మాట్లాడలేకపోయాడు. క్షణం గడిచాక కాస్త సర్దుకున్నాడు. ''ఇంతకీ నేనే కోపం చెందిన మనిషిని?'' నవ్వుతూ అడిగాడు.

వారిజ నవ్వింది. ఆ నవ్వు చాలా ఆహ్లాదంగా వుంది.

''హృదయమున్న మనిషి శిక్షను భరించగలడు గానీ, క్షమను భరించలేడు..'' ఆమె మాటల్లో చాలా అర్థాలు ధ్వనించాయి సాకేత్‌కి.

''నిజమే..ఈ నెలరోజుల నుండీ నాకు మనఃశాంతి లేకుండాపోయింది నీ క్షమను భరించలేక!'' నిజాయితీగా ఒప్పుకున్నాడు.

వారిజ మాట్లాడలేదు. మోకాళ్ళమీద గడ్డం ఆన్చుకుని అతన్నే చూస్తూ కూర్చుంది.

''నెలరోజులపాటు మనఃశాంతి లేకపోతే లేకపోయిందిగానీ, నాకో కొత్త విషయం తెలిసింది..'' సాకేత్ కళ్ళల్లో ఏదో మెరుపు.

''ఏవిటది..?'' ఆమె కళ్ళల్లో కుతూహలం.

''భార్యాభర్తలు ఒకరి తప్పుల్ని ఒకరు ఎత్తిచూపుకోడం, గొడవపడ్డమే మార్గం కాదని, తప్పుని సరిదిద్ది, జీవితాన్ని చిందర వందర కానివ్వక తిరిగి సక్రమ మార్గంలో నడిచేలా చేయడమే అసలైన సంస్కారం అని, అదే నిజమైన సంస్కరణ అని..నీ ప్రవర్తన నాకు మౌనంగానే విప్పి చెప్పింది. వారిజా! నువ్వు నాకు భార్యవి మాత్రమే కాదు..ఒక ఫ్రెండ్‌వి, ఒక గైడ్‌వి..ఒక ఫిలాసఫర్‌వి..'' మనస్ఫూర్తిగా ఆమెని అభినందించాడు.

''ఆపండి పొగడ్తలు..'' అక్కడినుండీ లేచి వెళ్ళబోయింది.

సాకేత్ ఆమె చెయ్యి పట్టుకుని ఆపాడు. పసి పిల్లాడిలా వచ్చి ఆమె ఒళ్ళో పడుకున్నాడు.

''పొగడ్తకీ- ప్రశంసకీ తేడా వుంది వారిజా! నేను నిన్ను పొగట్టంలేదు. ప్రశంసిస్తున్నాను. నిజం! అన్నట్టు నాకు మరో ముఖ్యమైన విషయం కూడా తెలిసింది..''

''మరొకటా..ఏవిటది?'' ప్రేమగా అతని జుట్టు నిమురుతూ అడిగింది.

''కొన్నాళ్ళ క్రిందట నిన్నొక ప్రశ్న అడిగాను గుర్తుందా?''

గుర్తులేదన్నట్టు తల అడ్డంగా వూపింది వారిజ.

''ప్రేమంటే ఏవిటో సరైన నిర్వచనం చెప్పమన్నాను. దానికి నువ్వు అది స్వానుభవంతోనే తెలుస్తుంది అన్నావు అవునా?'' ఆమె ముక్కుపట్టుకుని వూపుతూ అన్నాడు.

''అవును. అన్నాను. సో వాట్?''

''ఇప్పుడు తెలిసింది ప్రేమంటే ఏవిటో..''

''ఏం తెలిసిందో చెప్పండి'' వారిజ మాటల్లో కుతూహలం.

అతను ఆమె వైపు ఆరాధనగా, ప్రేమగా, లాలనగా, ఆప్యాయంగా, అలాగే చూసాడు. అతని చూపుల్లో రకరకాల భావాలు..ఒక వర్షంలా ఆమెని తడిపేస్తున్నాయి.

''ఊఁ..చెప్పండి'' వారిజ అతన్ని కుదుపుతూ అంది సస్పెన్స్ భరించలేనట్టు!

సాకేత్, వారిజ చేతిని తన చెంపల కానించుకుని, కళ్ళు మూసుకున్నాడు. హృదయంలోంచి మాట్లాడుతున్నట్టుగా తన అభిప్రాయాన్ని చెప్పాడు.

''ప్రేమంటే కేవలం మనిషిలోని అందాన్నీ, అందమైన భావాల్నీ, వాళ్ళ గొప్పతనాన్నీ మాత్రమే కాదు..అతనిలోని బలహీనతల్నీ, మైనస్ పాయింట్స్‌నీ కూడా ప్రేమించడమే నిజమైన ప్రేమని తెలిసింది.'' ☆

